


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య... మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలాసుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తితోనైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయం మాత్రమే.

వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్ళకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళామూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళారత్నాలు' నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ 'భారతీయం'.

*ఈ నవలారచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే సాహసం నేను చెయ్యలేను.*

*ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి, ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.*

★★★

## (ప్రారంభం)

రాష్ట్రపతి భవన్ ఆహూతులైన అతిథులతో అలంకరింపబడి ఉన్నది. అది పద్మ అవార్డుల బహూకరణోత్సవం. దేశప్రధానితో సహా అనేకమంది మంత్రులు, ప్రభుత్వాధికారులు, విశిష్ట అతిథులు విచ్చేసి ఉన్నారు. అందరి ముఖాల్లోనూ అదో రకమైన ఆనందం, సంతృప్తి, ఆమోదం. ఎందుకంటే భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ఆ సంవత్సరం భారతమ్మకు ఇవ్వబడుతోంది. ఆమె ఒక తెలుగు మహిళ.

సాధారణంగా పద్మ అవార్డుల విషయంలో పైకి అభినందనలు తెలుపుతూ పత్రికాప్రకటనలు విడుదల చేయటం వంటివి చేసినా, లోపాయికారీగా అసంతృప్తులు వెల్లడించడం అతి సహజం. కానీ ఈవిడ విషయంలో ఇంతవరకు 'భారతరత్న' ఇవ్వక పోవటమేమిటన్నది అందరి ప్రశ్న. వారందరి మనసులు సందడి చేసేలా, మురిసి పోయేలా ఈ సంవత్సరం శ్రీమతి భారతమ్మగారికి, 'భారతరత్న' ప్రకటించబడింది. దాని ప్రదానం ఈ రోజు జరగబోతున్నది. అదే ప్రస్తుతం అంతమంది మొహాల్లోని అంతులేని ఆనందానికి కారణం.

భారతమ్మ గారు పండుటాకు. ఆవిడ వయసు తొంభై ఏళ్ళు. అక్షరాలా తొంభై ఏళ్ళు. ఆవిడకు భారతరత్న బహుకరిస్తున్నప్పుడు రాష్ట్రపతి భవన్ పులకించి పోయింది. ఒక్క రాష్ట్రపతి భవన్ ఏమిటి? దేశంలో టీవీల ముందు కూర్చున్న కోట్ల మంది ప్రజానీకం ఆ పురస్కారం తమకే లభిస్తున్నట్లు పులకించి పోయి చప్పట్లు కొట్టారు. అవార్డు అందుకుంటున్న ఆవిడ మొహం ప్రసన్నంగా, వినమ్రంగా, నిష్కల్మషంగా ఉంది. రాష్ట్రపతికి గౌరవసూచకంగా ఆవిడ వంగిందే కానీ, ఆవిడ వెన్నుపూస వంగిపోలేదు. ఆ వయసులో ఉన్న ఆవిడ చక్రాల కుర్చీలో రాలేదు, ఎవరూ ఆమెను మోసుకు తేలేదు, ఎవరి ఆసరా ఆవిడ తీసుకోలేదు. నిదానంగా, హుందాగా అక్కడి సెక్యూరిటీ ఆఫీసర్ ఆమె పక్కన వస్తుండగా స్వయంగా నడుచుకుంటూ వచ్చింది.

ఆ దృశ్యం చూస్తున్న ప్రేక్షకులకు ఆ పురస్కారం ప్రకటించిన నాడు భారతి తనను ఇంటర్వ్యూ చేసిన వారితో చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ఒక జాతీయ టీవీ ఛానల్ తరఫున వచ్చిన విలేఖరి ఆమెను ఆంగ్లంలో, ‘‘ఈ వయసులో మీరీ అవార్డును స్వీకరించటానికి ఢిల్లీ దాకా వెళతారా?” అని ప్రశ్నించాడు. భారతి నవ్వుతూ ఆంగ్లంలోనే సమాధాన మిచ్చింది.

“ఎందుకు వెళ్ళను? ఇది నా సేవలను గౌరవించి భారత ప్రభుత్వం నాకిస్తున్న పురస్కారం. మరి ఇస్తున్న ఆ ప్రభుత్వాన్ని గౌరవించి నేను ధన్యవాదాలు చెప్పుకోవద్దూ? నా వయసు మీరు తొంభై అనుకుంటున్నారేమో, కానీ పంతొమ్మిది. సంఘసేవ చేసేటప్పుడు నా వయసు అదే. ఆ భగవంతుడు నన్ను ఇన్నేళ్లు బతికించాడంటేనే ఇంకా నేను చెయ్యవలసినదేదో ఉందన్న మాట. దేశానికి సేవ చేసే అవకాశం వస్తే, దేనికోసమయినా దాన్ని వదులుకోను.” ఆమెను ప్రశ్నించిన విలేఖరి కూడా ఆ జవాబుకి మురిసి చప్పట్లు కొట్టాడు.

“మిమ్మల్ని, మీ జీవితాన్ని గమనిస్తే, భారతదేశ చరిత్ర వ్రాస్తే మీ ప్రసక్తి లేకుండా వ్రాయలేము, మీ చరిత్ర వ్రాస్తే భారత దేశ చరిత్రను స్పృశించకుండా ఉండలేము. మీరు భారతి అయితే మీ జీవిత కథ ‘భారతీయం’. దేశానికీ, దేశ ప్రజలకూ భేదం లేని స్థితి వస్తే అదే కదా జాతి ఆత్మ ఆవిష్కారం. అదే కదా భారతీయం!” మరో విలేఖరి ఆమెకు హృదయపూర్వకంగా నమస్కరిస్తూ హిందీలో అన్నాడు. అతనికి హిందీలోనే కృతజ్ఞతలు తెలిపింది భారతి.

ప్రతి భారతీయుడు, భారతీయురాలు భారతి లాగా ఆలోచిస్తే, భారతదేశం ప్రపంచ దేశాలకే ఆదర్శప్రాయం కాదా?

## 1

**తూ**ర్పు దిక్కున తెలతెలవారుతోంది. భారతీయుల మనసులో రగులుతున్న స్వాతంత్ర్య కాంక్షకు అద్దం పడుతున్నట్లు ఆకాశం నారింజరంగులో ఉంది. లేలేత భానుడు నింగిలోకి ఎగబాకుతూ వెలుగును విరజిమ్ముతున్నాడు. భారతీయులందరూ, ఆ మాటకొస్తే మనుషులే కాదు భారత దేశంలో పుట్టిన గొడ్డు, గోదా, పిట్టా, పువ్వు కూడా స్వాతంత్ర్యం కోసం తపించిపోతున్న రోజులవి.

ఇటువంటి పరిస్థితి దేశమంతటా నెలకొన్న వేళ, ఆ తెల్లవారుఝామున, పార్వతీశం ఇంట్లో హడావుడిగా ఉంది. పురిటిగదిలో లాంతరు వెలుగుతోంది. ఆ ఇంటి ఇల్లాలు నొప్పులు పడుతోంది. కానుపొచ్చే సమయం దగ్గర పడుతుండడంతో మంత్రసానికి కబురు వెళ్ళింది, కానీ ఆమె ఇంకా రాలేదు. ఆమె వచ్చేలోగా ఆ ఇంటిలోని పురిటి గదిలోకి అవసరమైన సామాను ఒక్కొక్కటిగా చేర్చబడుతోంది.

హైమవతి పురిటి నొప్పులతో సతమతమౌతూనే పెద్దపిల్ల రాజేశ్వరికి చెయ్యవలసిన పనులన్నీ చెప్తోంది. “రాజూ, నా పాత చీరలు తెచ్చి ఈ గదిలో పెట్టు. అలమరలో ఆముదం ఉంది చూడు నాన్నా. పొట్టు పొయ్యి సిద్ధంగా ఉన్నది. నాన్నని వేడినీళ్లు పెట్టమని చెప్పు.” పళ్ళ బిగువున బాధ భరిస్తోంది హైమవతి. రాజేశ్వరి బుద్ధిగా అమ్మ చెప్పినవన్నీ చేస్తోంది. ఆరేళ్ళ ఆ పసిదానికి అమ్మ పడుతున్న బాధ అర్థమయ్యింది. అందుకే రోజూ అల్లరి చేసేది నోరెత్తకుండా అమ్మ చెప్పినట్లు చేస్తోంది. అసలు ఆరోజు ఎన్నడూ లేనిది పొద్దున్నే అమ్మ తనని లేపటమే కాక ఈ పనులన్నీ చెప్పటం రాజు కెంతో వింతగా ఉంది.

అప్పటికే అన్న ముకుందం లేచి ఎటో వెళ్ళటం, కూడా తనని కాక, తమ్ముడు మురారిని తీసుకు వెళ్ళటం రాజుకెంతో ఉక్రోషాన్ని కలిగించింది. అయినా అమ్మ చెప్పిన పనులన్నీ చేస్తూనే ఉంది. చేస్తూనే మనసును తొలిచేస్తున్న సందేహాన్ని అమ్మని అడగకుండా ఉండలేకపోయింది.

“అమ్మా, నీ కేమయ్యింది? నువ్వెందుకిట్లా పడుకున్నావు? నేనూ బజ్జోనా నీ పక్కన?” అంత బాధలోనూ ఫక్కున నవ్వింది హైమవతి.

"నీ బొజ్జలోనూ పాపో, బాబో ఉంటే, అప్పుడు నువ్వూ పడుకోవచ్చు" రాజు కళ్ళు మెరిశాయి.

"అమ్మా, నా బొజ్జలోనూ బాబున్నాడు. చూపిస్తా ఉండు." రివ్వున మూలగదిలోకి పరిగెత్తి తన చెక్క బొమ్మను తెచ్చింది రాజు. అంత బాధలోనూ నవ్వుతూ చూస్తోంది హైమవతి కూతురి వంకే. రాజు ఆ బొమ్మను తన పరికిణీ మీద వేసుకున్న బుట్ట చేతుల పొడుగు జాకెట్టు కింద పెట్టుకుంది. ఆ ముద్దు చేష్టకు మరింత నవ్వు వచ్చింది హైమవతికి. నవ్వుతూనే ఉన్నట్టుండి పొట్టలో నొప్పి రావటంతో కెవ్వున అరిచింది.

“అమ్మా... అమ్మా...” రాజేశ్వరికి భయం వేసి ఏడవటం మొదలు పెట్టింది. హైమవతి పళ్ళ బిగువున బాధను భరిస్తూ “రాజూ, నువ్వు బయటకు పోమ్మా. నరసమ్మ వచ్చిందేమో చూడు” అంది. రాజు వెక్కిళ్లు పెడుతూ బయటకు పరిగెత్తింది.

“నరసమ్మ వచ్చిందా నాన్నా? అమ్మకి పొట్టలో చాలా నొప్పి వస్తోంది” వెక్కుతూ బయట గేటు దగ్గర ఉన్న తండ్రి పంచె లాగుతూ అడిగింది. రాజేశ్వరి వంక తిరిగిన పార్వతీశంకి ఆ పసిదాని మొహంలో బాధ, భయం అర్థమయ్యాయి

“భయపడకమ్మా, చిట్టి తమ్ముడో, చెల్లాయో వచ్చేముందు అలాగే పొట్టలో నొప్పి వస్తుంది. నువ్వు ఆడుకునేందుకు చెల్లాయి కావాలని అడిగావుట కదా అమ్మని.”

“అమ్మకింత నొప్పేస్తుందని తెలియదు నాన్నా. లేకపోతే అడిగేదాన్ని కాదు. ముసలమ్మ గారిని పిలుచుకు రానా నాన్నా” ఏడుపు గొంతుతో అంది రాజేశ్వరి. ముసలమ్మ గారంటే శయనమ్మ గారు.

“ఫరవాలేదు రాజూ. నరసమ్మ వచ్చేస్తోందిగా. ఇంక అమ్మకేమీ ఫరవాలేదు. ముసలమ్మ గారు ఊళ్ళో లేరు తల్లీ”

మంత్రసాని నరసమ్మ వస్తూనే పురిటి గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది. రాజుకి గాభరా మరీ ఎక్కువైంది. పార్వతీశం గారికి కూడా పైకి చెప్పక పోయినా కొంత కంగారుగానే ఉంది. హైమకి కాన్పు అనుకున్నదాని కంటే ముందుగా వచ్చేసింది. అత్తమామలు ఎలానూ అందుబాటులో లేరు. ఉన్న శయనమ్మగారు కూడా కాన్పుకి ఇంకా సమయం ఉండటంతో పొరుగూరికి వెళ్ళింది. ఆవిడ ఉంటే కంగారు పడాల్సిన అవసరమే ఉండేది కాదు. కన్నతల్లి కంటే మిన్నగా చూసుకునేది. హైమవతి ముందరి పురుళ్ళు ఆవిడ చేతి మీదుగానే అయ్యాయి. అక్కడికీ ఆవిడ నిన్న ఊరు వెళ్తూ అడగనే అడిగింది

“వెళ్ళి రానా అమ్మా? ఒంట్లో ఎలా ఉంది?” అని. హైమ బాగుందనీ, కాన్పు వచ్చే సూచనలేవీ లేవని చెప్పాకే వెళ్ళింది. ఇంతలోకే ఇలా ముంచుకు వచ్చింది.

శయనమ్మ గారితో పరిచయం, అనుబంధం గుర్తొచ్చి పార్వతీశం కళ్ళు చెమర్చాయి. ఆమె తమ జీవితాల్లో విడదీయలేని భాగం అయిపోయింది. తల్లిదండ్రులు లేని తనకు, అమ్మానాన్నలు దేశసేవలో మునిగి అండనివ్వలేని స్థితిలో ఉన్న హైమకు పెద్దవాళ్ళు లేని లోటు తీరుస్తోంది. కేవలం తమకనే కాదు, ఊళ్ళో అందరికీ ఆవిడ ఎంత అండ! శయనమ్మ గారి వంటి వ్యక్తి తమ జీవితంలో భాగమవటం నిజంగా తమ అదృష్టం!

2

**శ**యనమ్మ ఒక బాల వితంతువు. వినే మనసుండాలే గానీ ప్రతి ఆడ జన్మ అనుభవాల దొంతరే. అవి మంచివైనా కావచ్చు, చెడ్డవైనా కావచ్చు. రెండింటి మిశ్రమమైనా కావచ్చు. శయనమ్మ జీవితంలో మటుకు రెండవ రకం అనుభవాలే ఎక్కువ.

శయనమ్మ పెళ్ళి ఆరేళ్ళ వయసులో జరిగింది. ఆమె పెళ్ళి వేళ్టికే భర్తకి క్షయ వ్యాధి. ఆ రోజుల్లో క్షయ వ్యాధికి మందు లేదు. కొడుకు జబ్బుతో ఉన్నాడని, ఏ నిమిషాన అయినా పోవచ్చని ఆమె అత్తమామలకు తెలుసు. కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి కొడుక్కి పెళ్ళి చేశారు. ఇటు శయనమ్మ తల్లిదండ్రులకూ అల్లుడి జబ్బు గురించి పెళ్ళికి ముందే లోపాయికారీగా ఎవరి ద్వారానో తెలుసు. కానీ పది నూర్ల కన్యాశుల్కానికి ఆశపడి పిల్ల గొంతు కోశారు.

ఆమె తండ్రి ఎంతో పేదవాడు. పౌరోహిత్యంతో జీవితం వెళ్లదీసే అతను, కూతురి కన్నెచెర తీరి, ఆస్తిపరుల ఇంట్లో పడితే చాలనుకున్నాడు. ఆమె అత్తవారి సాయంతో మిగిలిన ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరపవచ్చనే ఆనందంలో ఉన్నాడే కానీ, బంగారం లాంటి పిల్లను నేడో రేపో అన్నట్లున్న వాడికి కట్టబెట్టటమేమిటని ఆలోచించనే లేదు. తల్లి కూడా అల్లుడి ఆరోగ్యం గురించి తెలిసినా ఇసుమంతైనా బాధపడలేదు. పైగా శయనమ్మ భర్త ఒకడే సంతానం. ఆస్తి మొత్తం భవిష్యత్తులో శయనమ్మదే.

ఆ పెళ్ళి చెయ్యటంలో శయనమ్మ అత్తమామల ఆలోచన వేరు. ఎలాగోలాగ అతని కడుపున ఒక కాయ కాస్తే వారి వంశం నిలబడుతుంది. స్వార్థం మనుషులను ఎంతకైనా దిగజారుస్తుంది కదా! శయనమ్మ పెద్దమనిషి అవటం ఆలస్యం కాపురానికి పంపించమని ఒత్తిడి చేశారు అత్తమామలు. అబ్బాయి ఇంట్లోనే తొలి రాత్రి జరపటం వారి ఆచారం. శయనమ్మను కాపురానికని తెచ్చిన రోజుకే మంచంలో ఉన్నాడు అతను. ఆ రోజే ఏదో జ్వరం వచ్చిందనీ, తగ్గగానే ముహూర్తం పెట్టించి కబురు చేస్తామని నమ్మబలికారు అత్తమామలు. తల్లిదండ్రులు ఆ అమ్మాయిని తెచ్చి దించిన పదిరోజుల లోపే, శయనమ్మ భర్త జబ్బుతో తీసుకుని, తీసుకుని పోయాడు. ఈ విధంగా శయనమ్మకు కాపురం అంటే ఏమిటో తెలియకుండానే వైధవ్యం సంప్రాప్తించింది.

భర్త పోవటంతో, పధ్నాలుగో ఏటే బారెడు పొడవున్న ఆమె జుట్టును, ఆమె ఏడ్చి మొత్తుకుంటున్నా వినకుండా తీయించేసారు. ఏటి దగ్గరకు తీసుకు పోయి పసుపుకుంకుమలు, గాజులు, పూలు ఆమెకు శాశ్వతంగా దూరం చేశారు. ఒక తెల్ల సైను పంచె కొనిచ్చి అదే కట్టాలన్నారు. నెత్తిన ముసుగు తొలగితే తప్పన్నారు. పాపం, మొగుడి మొహం ఎలా ఉంటుందో కూడా ఎరుగని శయనమ్మ బ్రతుకు, అతను పోయిన కారణంగా బుగ్గి అయ్యింది.

కొడుకు క్షయరోగంతో పోయాడన్న నిజాన్ని దాచి, శయనమ్మ ఇంట్లో అడుగు పెట్టిన వేళావిశేషం బాగో లేదనీ, అందుకే నిక్షేపంలా ఉన్న కొడుకు నెల కూడా తిరక్కుండా పోయాడనీ ప్రచారం మొదలు పెట్టారు అత్తమామలు. ఇది వారి కుటిల మనస్తత్వాన్ని ఎత్తి చూపుతుంది.

శయనమ్మ అత్తగారు అప్పటికే ఉబ్బసం వ్యాధితో బాధ పడుతోంది. కొడుకు పోయిన దగ్గిర నించి ఆమె వ్యాధి తీవ్రమయ్యింది. అందుకే కొడుకు కర్మ కాండలు అవగానే కోడలిని పుట్టింటికి పంపేద్దా మనుకున్న వాళ్ళల్లా, ఇంట్లో చాకిరీకి పనికొస్తుందని, నలుగురి ముందు మంచితనం నటించి, ఆమెను ఉద్ధరిస్తున్నట్లు తమ దగ్గరే ఉండమన్నారు అత్తమామలు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆమె తండ్రి అదే పదివేలనుకొని శయనను అక్కడ వదిలేసి మరి తిరిగి చూడలేదు.

పైగా వెళ్ళేముందు కూతురికి హితబోధ చేసాడు. "అమ్మా, ఇదే నీ ఇల్లు, వీరే నీ తల్లితండ్రులు. నీ చావైనా, బ్రతుకైనా ఇక్కడే. మేమున్నామని మరచిపో. మాకు అప్రతిష్ఠ తెచ్చే పనులేవీ చెయ్యకు. మీ అత్తమామలకు ఎదురు చెప్పకు. ఎవరి కంటా పడకు. గుమ్మం విడిచి బయటకు వెళ్ళకు. ఇంట్లో పెద్దవాళ్ళిద్దరూ పడుకున్నాకే పడుకో. ఇందుకు విరుద్ధంగా జరిగిందా, నువ్వు చచ్చావనుకునుకుంటాం. కనుక ఏ నుయ్యో, గొయ్యో చూసుకో. నీకు పుట్టిల్లు అనేది ఉందని మరచిపో."

ఆ రోజు నుంచి ఆ ఇంట్లో మూల గది ఆమె సొంతమయ్యింది. చీకటి పడకముందే లేచి ఇంటి పని మొత్తం ఆమే చెయ్యాలి. కానీ వెలుగు వచ్చాక ఎవరి కంటా పడకూడదు.అది ఎందుకో, తాను చేసిన అపరాధ మేమిటో ఆమెకు అర్థమయ్యేది కాదు. పొరపాటున ఎవరన్నా, ఏమన్నా పని మీద వెళ్లేప్పుడు ఆమె ఎదురు వెళ్ళిందంటే మామగారి శాపనార్థాలే కాక, అత్తగారి దెబ్బలు కూడా ఆమెకు తప్పేవి కావు. వింతేమిటంటే, లేచి పని చేసే శక్తి లేక పొద్దస్తమానం మంచంలోనే పడి ఉండే అత్తగారు, తినడానికి, కాలకృత్యాలకు కూడా శయనమ్మమీదే ఆధారపడే అత్తగారు, శయనమ్మను కొట్టటానికి మటుకు శక్తి తెచ్చుకు మరీ చేతులారా బాదేది. ఆమె పిలిచిన మరుక్షణంలో మంచం పక్కన నిలువకపోతే చేతికందిన వస్తువును శయనమ్మ మీదకు విసిరేది. ఆమెకు జబ్బు వలన కలిగిన నిస్పృహ మొత్తాన్ని శయనమ్మను కొట్టటంతో, హింస పెట్టటంతో తీర్చుకునేది. గొడ్డులా దెబ్బలు తినటమే తప్ప శయనకు వేరే గతేమీ ఉండేది కాదు. ఇంటెడు చాకిరీ చేసి, మిగిలింది తిని, మూల గదిలో ఏడుస్తూ కూర్చోవడమే ఆమెకు మిగిలింది.

రాజ్యాలనేలే మహిళలను చూస్తున్న ఈ కాలంలో, శయనమ్మ జీవితం ఇప్పటివారికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ ఒక అయినింటి కోడలికి జరిగే అన్యాయం ఆ రోజుల్లో ఇలాగే ఉండేది. అసలు అత్తగారికి ఎదురు చెప్పటం అనే ఆలోచన కూడా కోడళ్ళకి రాని రోజులవి. అందునా పూట గడవని ఇంటి నుంచి వచ్చిన శయనమ్మలాంటి ఆడపిల్లల గురించి చెప్పేదేముంది? ఆరోజుల్లో ఇంచుమించు వితంతువులందరి కథలూ ఇంతే. అప్పట్నుంచి రాతిలా బతకటం మొదలు పెట్టింది శయనమ్మ. జీవితం అలాగే వెళ్ళిపోయుంటే ఆమె గురించి చెప్పుకోవటానికి మనకి కథేమీ ఉండేది కాదు.

ఒకనాటి రాత్రి తన గదిలో నిద్రిస్తున్న ఆమె మీద మామగారు అత్యాచారం జరపబోయాడు. ఆమె మొహం చూడటానికే చీదరించుకునే ఆయన, ఆ రోజు తెల్లవారు ఝామున బహిర్భూమికి వెళ్ళ వలసి వచ్చి లేచాడు. చెంబు పట్టుకుని, చెరువుకట్టకు వెళ్లే ఆయనకి, తమ ఇంట్లోని బావి దగ్గర చన్నీళ్ళ స్నానం చేస్తున్న కోడలు కనిపించింది. తన నౌకరు ఒళ్ళు మరచి చూస్తున్నారనే అనుమానం కూడా లేని శయన, తడి బట్టలతోనే మడి నీళ్ళు తోడటం, తులసి కోటలో నీళ్లు పొయ్యటం, వాకిలి

చిమ్మి ముగ్గు పెట్టటం, వంటివి చేసింది. అంతసేపు ఆమె ఒంపులని చూస్తూ, మనసులోనే తడుముతున్న మామగారు ఆమె వంటగదిలోకి వెళ్లటంతో ఇహంలోకి వచ్చి, తనని తనే తిట్టుకున్నాడు ఇంట్లో ఉన్న అందాన్ని గుర్తించనందుకు.

శయనమ్మ పదహారేళ్ళ పరువమే ఆయనకు కనిపించింది కానీ, వావివరుసలు కనిపించలేదు. ఆమె తన కోడలని, భర్తను చిన్న వయసులోనే పోగొట్టుకున్న అభాగ్యురాలనీ గుర్తుకు రాలేదు. ఆ చలికాలంలో, తెల్లవారుఝామున, తామందరూ వెచ్చగా గదులలో పడుకుని ఉన్నప్పుడు, చన్నీళ్ళ స్నానం చేసి, ఇంటి పనులు చక్కబెట్టాల్సిన ఆమె దుస్థితి ఆయనకు జాలి కలిగించలేదు. ఆమె తనకు కూతురితో సమానమని ఆయనకు తోచనే లేదు. ఏ పరిస్థితుల్లోనూ పశువులు గడ్డి మేయటానికే చూస్తాయి కదా.

ఆ రాత్రి, పగలంతా గొడ్డు చాకిరీ చేసి పడుకున్న ఆమె మీద దాడి చేశాడు మామగారు. శయనమ్మ బిత్తరపోయింది. ఆమెకు జరుగుతున్నది అర్థం కాలేదు. కొద్దిగా తేరుకుని చూసేసరికి పైశాచికంగా నవ్వుతూ మామగారు మీదిమీదికొస్తున్నాడు. ఒక్కసారిగా బెదిరిపోయి కేక పెట్టింది శయనమ్మ. ఆయనను విదిలించుకుని లేవటానికి విశ్వ ప్రయత్నం చేసింది కానీ ఆమె శక్తి చాలలేదు. దిక్కులేని ఆమెను ఆదుకునేదెవరు? శయనమ్మ తన బలమంతా ఉపయోగించి ఆయన బారినుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది. కానీ ఆమె చిన్నపిల్ల. సరైన తిండి కూడా తినకుండా నీరసపడి ఉన్న అబల. ఆయన మంచి బలిష్ఠుడు.

తన జీవితం మట్టిపాలయ్యిందనే అనుకుంది శయనమ్మ. రెండు చేతులు జోడించి మామగారికి నమస్కారం పెట్టింది. తనని వదిలెయ్యమని దీనంగా వేడుకుంది. కానీ శయనమ్మ ఆక్రందనలు చెవిటివాడి ముందు ఊదిన శంఖమయ్యాయి. పెళ్లప్పుడు త్వరలో మనవడిని అందించాలని దీవించి అక్షింతలు వేసిన చేతులతోనే, ఆమె కట్టుకున్న పంచెని లాగుతున్నాడు మామగారు. ఇంచుమించు స్పృహ కోల్పోయింది శయనమ్మ.

ఆ క్షణంలోనే శయనమ్మ ఆర్తనాదం విన్న ఆమె అత్తగారు, దగ్గరకు వేసిన తలుపులని తోసుకుని వచ్చింది నడవలేక నడవలేక ఆయాసపడుతూ. జరుగుతున్న అకృత్యం చూసి అచేతనురాలయ్యింది ఆమె. ఆమె దృష్టిలో భర్త దేవుడు. సదాచార పరాయణుడు. తనను అమితంగా ప్రేమించే ప్రేమమూర్తి. కానీ జరుగుతున్నది వేరు. ఆ క్షణంలో అతనిని చూస్తుంటే ఆమె మనసులో అతని మీద కలిగిన ఏహ్యతను వ్యక్తపరచటానికి ఏ భాషలోనూ సరైన పదాలు లేవు. అక్కడే కొయ్యబారినట్లు నిల్చుండి పోయిందా ఇల్లాలు.

తలుపు దగ్గర అయిన అలికిడికి తల తిప్పి చూసాడు మామగారు. ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాడు. గుమ్మంలో రొప్పుతూ, రోజుతూ, ఆయాసపడుతూ తన భార్య! మంచాన పడి, లేవలేని స్థితిలో ఉన్న భార్య ఇక్కడికి ఎలా వచ్చింది? ఆయనకు మతిపోయింది. జరుగుతున్నది నమ్మలేని దిగ్భ్రమ ఆమె మోహంలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆమె చూపుల్లో మెదులుతున్న ఆ భావం ఏమిటి? అది బాధా? భయమా? అసహ్యమా? అవమానమా? ఆయనకు అర్థం కాలేదు. అంతవరకు జీవితంలో తనేం చేసినా ఆవిడ ఆమోదించింది. ఒక్కనాడూ ఇది ఏమిటని అడగలేదు. ఆమెకు జబ్బు చేశాక తాను భోగం వీధుల వెంబడి తిరగటం తెలిసి కూడా ఏనాడూ బయట పడలేదు. ఆమె చూపుల్లో తన మీద కనపడే గౌరవం ఇసుమంతైనా తగ్గలేదు. ఈరోజుకీ నిద్ర లేవగానే మంగళసూత్రాలు కళ్ళకద్దుకుంటుంది. తన వంక దేముడి వంక చూసినంత భక్తిగా చూస్తుంది.

అలాంటి ఆమె కళ్ళల్లో ఈనాడు కనిపించే ఆ కొత్త భావమేమిటి? తాత్కాలికంగా ఆయన తలకెక్కిన ఉన్మాదం దిగిపోయింది. లేచి గబుక్కున ఆమె వైపు నడవబోయాడు.

ఆయన వంకే చూస్తున్న శయనమ్మ అత్తగారు తన ఒక్క చూపుతో ఆయనను అక్కడే నిలిపేసింది. మామగారు తనపైనుండి లేవగానే, శయనమ్మకు ఊపిరందింది. మూడొంతులు ఊడిపోయిన పంచెను సరిచేసుకుని ముసుగు వేసుకుంది. తనను రక్షించినదెవరా అని తల ఎత్తి చూసింది. ఒక్క చూపులోనే అత్తగారి పరిస్థితి అర్థమయింది శయనమ్మకు. ఒక్క పరుగున వంటింట్లోకి పరిగెత్తి మంచినీళ్లు తెచ్చింది. ఆయాసపడుతున్న అత్తగారిని తన ఒడిలోకి తీసుకుని మంచినీళ్లు కాసిని మొహాన చల్లి, మిగిలినవి తాగించాలని ప్రయత్నించింది. కోడలి స్పర్శతో ఒంటి మీదకు తెలివి వచ్చింది ఆవిడకి.

“పారిపోవే పిచ్చి మొహమా! ఆ తోడేలు నిన్ను మింగేస్తుంది.” కళ్ళు పెద్దవి చేసి కోడలికేసి చూస్తూ అన్నది. ఆమె వైపు ఒక్క అడుగు వేయబోయాడు ఆమె భర్త. యావత్ప్రపంచంలోని అసహ్యమంతా మోహంలో నింపుకుని భర్త వైపు చూస్తూ "ఛీ" అన్నది. అంతే, ఆవిడ ఊపిరి నిలిచిపోయింది. ఆమె అసహ్యాన్ని చూసిన మామగారి మొహంలో అనూహ్యమైన మార్పు వచ్చింది. వెర్రి మొహం పడ్డది. పట్టిన దయ్యం వదిలింది.

“అమ్మాయ్, మీ అత్తగారు నన్ను ఛీ అంది!” అన్నాడు శయనమ్మతో. ‘అమ్మాయ్’ అన్న పిలుపు ఆయన నోటి వెంట అప్రయత్నంగానే వచ్చింది. అలా పిలిచిన క్షణంలోనే ఆయనకు తాను తలపెట్టిన పాతకం అర్థమయ్యింది. ఎంత చెడ్డా, శాస్త్రాలు, పురాణాలు చదివిన పెద్దమనిషి. భార్య ఛీత్కారంతో ఆయనకు పట్టిన దెయ్యం వదిలిపోయింది ఆ క్షణాన ప్రాణం పోతే బాగుండుననినిపించింది ఆయనకు. రక్తపోటు విపరీతంగా పెరిగింది. ఆయన కుడికాలు, చెయ్యి వంకర తిరిగాయి. ఒక్కసారిగా ముందుకి పడ్డాడు. ఆ పడటంలోనే ఒక చెయ్యి శయనమ్మ పాదాలపైనా, మరో చెయ్యి ప్రాణం పోయిన భార్య పాదాలపైనా పడ్డాయి. అంతే, ఆయనకి స్పృహ తప్పింది.

ఆ తరవాత ఒక్క నెల రోజులు బ్రతికాడేమో ఆయన. తాను చేసిన పాపం ఫలితం బ్రతికుండగానే అనుభవించాడు. భార్య లేదు. ఎవరికైతే క్షమించరాని ద్రోహం తలపెట్టాడో, ఆ కోడలి చేతే సేవలు చేయించుకోవాల్సి వచ్చింది. బ్రతికినన్నాళ్ళు మంచంలోనే ఉన్నాడు. కళ్ళు తెరవగలిగే వాడే కాదు. తెరిస్తే రెండు చేతులు ఎత్తి కళ్ళనిండా నీళ్లతో శయనకు దణ్ణం పెట్టేందుకు ప్రయత్నించేవాడు. ఒకసారి అలాగే దణ్ణం పెట్టబోతుండగా మూసుకుపోయిన కళ్ళు ఇక తెరుచుకోలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS